సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 22 । జూన్ । 2025





సాగర తీరంలో యోగాసనాలు వేస్తున్న ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు

రికార్డు యోగా

యోగాంధ్రకు రెండు గిన్నిస్ రికార్డులు

- పాల్గొన్న పీఎం మోదీ, గవర్నర్, సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- 25 వేల గిరిజన విద్యార్థుల సూర్య నమస్కారాలు
- 3 లక్షలకు పైగా ప్రజలు యోగాసనాలతో సూరత్ రికార్డు బ్రేక్

విశాఖ సిటీ: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం విశాఖలో ఘనంగా నిర్వహించారు. అట్టహాసంగా 'యోగా ఫర్ వన్ ఎర్త్ ఎన్ హెల్త్' నినాదంతో చేపట్టిన యోగాంధ్ర వేడుకల్లో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఎం యోగా విశిష్టతలపై ప్రసంగించారు. అనంతరం 3.03 లక్షల మంది ప్రజలతో కలిసి 45 నిమిషాల పాటు యోగాసనాలు వేశారు.

రెండు గిన్నిస్ రికార్డులు సొంతం

ఈ యోగాంధ్ర కార్యక్రమం ద్వారా రెండు గిన్నిస్ రికార్డులు సొంతమయ్యాయి. శుక్రవారం సాయంత్రం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో 25 వేల మంది గిరిజన విద్యార్థులు యోగాసనాలు వేశారు. 108 నిమిషాల పాటు 108 సూర్య నమస్కారాలు చేసి రికార్డు సృష్టించారు. అలాగే శనివారం ఉదయం ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన 326 కంపార్ట్‌మెంట్లకు 3.03 లక్షల మంది జనాలు వచ్చారు. ఏకకాలంలో సామూహిక యోగాసనాలు వేసినందుకు గాను మరో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సొంతమైంది. గతంలో సూరత్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో 1.47 లక్షల మంది పాల్గొనగా.. విశాఖ జరిగిన కార్యక్రమానికి 3.03 లక్షల మంది ప్రజలు భాగస్వాములయ్యారు. ఈ రెండు గిన్నిస్ రికార్డు ధ్రువపత్రాలను మంత్రులు లోకేష్, సత్యకుమార్‌లకు అందజేశారు.

యుద్ధ నౌకల్లో నేవీ సిబ్బంది విన్యాసాలు

ఈ యోగాంధ్ర కార్యక్రమంలో తూర్పు నావికా దళం కూడా భాగస్వామ్యమైంది. ఈఎన్‌సీకి చెందిన 11 యుద్ధనౌకలను శనివారం ఉదయం సాగర తీరంలో మోహరించారు. అందులో నేవీ అధికారులు, సిబ్బంది కూడా యోగాభ్యాసాలు చేశారు. వీరితో పాటు 11 వేల మంది నేవీ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు శనివారం ఆర్కే బీచ్ నుంచి పార్క్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన వేదికల్లో కూడా యోగాసనాలు వేశారు.



తీరంలో నగర పౌరుల యోగాసనాలు

ఊపిరి పీల్చుకున్న అధికారులు

యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు కొన్ని నెలలుగా శ్రమిస్తున్నాయి. జిల్లాలో అన్ని శాఖల అధికారులు సమన్వయంగా అహర్నిశలు కష్టపడ్డారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 5 లక్షల మందిని తరలించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని ఇచ్చింది. అందుకు తగ్గట్లుగానే అధికారులు ప్రయత్నాలు చేశారు. అయితే లక్ష్యానికి చేరుకోలేకపోయినప్పటికీ.. 3.03 లక్షల మందిని తీసుకువచ్చి గిన్నిస్ రికార్డు సొంతమయ్యేలా చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, గవర్నర్, సీఎం, ఇతర ప్రముఖులు హాజరవడంతో ఒకవైపు వారి భద్రత, వసతితో పాటు మరోవైపు జనాల తరలింపు, వారికి ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. లోటుపాట్లు ఉన్నప్పటికీ.. యోగాంధ్ర కార్యక్రమం ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ఏయూ గ్రౌండ్ దిక్కయింది..

యోగాంధ్రలో గిన్నిస్ రికార్డుకు వేదికైన ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ గ్రౌండ్‌ను అభివృద్ధి చేశారు. ఆ సమయంలో అస్తవ్యస్తంగా ఉన్న గ్రౌండ్‌లో గ్రావెల్ వేసి ఎత్తు పెంచారు. అలాగే దాని ఎదురుగా దశాబ్దాలుగా తుప్పలు, పిచ్చి మొక్కలతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ప్రాంతాన్ని సైతం చదును చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆ సమయంలో కూటమి నేతలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఏయూ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని తప్పుడు ప్రకటనలు చేశారు. ఇప్పుడు 25 వేల మంది గిరిజన విద్యార్థులు యోగాసనాలకు వేదికైంది. గిన్నిస్ రికార్డును చేరువ చేసేందుకు పరోక్షంగా కారణమైంది.



నౌకపై నేవీ సిబ్బంది యోగాసనాలు

తిండి లేదు.. నిద్ర లేదు

- యోగాంధ్రలో గిరిజన విద్యార్థుల అష్టకష్టాలు
- గురువారం సాయంత్రమే విశాఖకు కొందరి తరలింపు
- వసతి లేక ఇబ్బందులు.. గ్రౌండ్, బస్సుల్లోనే విద్యార్థుల నిద్రలు
- బురదలోనే భోజనాలు, తాగునీటి కోసం పాట్లు
- 5 వేల మందికి 10 టాయిలెట్లు.. కంపుతో అల్లాడిన చిన్నారులు
- అర్ధాకలి.. నిద్ర లేక నీరసించినా గిన్నిస్ రికార్డు కొట్టిన విద్యార్థులు



కాళ్లకు చెప్పులు లేకుండా వాటర్ బాటిళ్లు మోస్తున్న విద్యార్థులు

విశాఖ సిటీ: యోగాంధ్ర కార్యక్రమం పేరుతో కూటమి ప్రభుత్వం అభం శుభం తెలియని గిరిజన విద్యార్థులను అష్టకష్టాలు పెట్టింది. గిన్నిస్ రికార్డు పేరుతో అల్లూరి జిల్లా నుంచి వేల మంది చిన్నారులను నగరానికి తీసుకువచ్చి సరైన వసతి కల్పించకుండా నరకం చూపించింది. సక్రమంగా భోజనం పెట్టకుండా.. నిద్రపోవడానికి వసతి ఏర్పాటు చేయకుండా రోడ్డు పాల్జేయడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటించారు. భోజనాల వద్ద తోపులాటల్లో నలిగిపోయారు. బురదలోనే భోజనాలు, టిఫిన్లు చేశారు. నిద్ర లేక నీరసించారు. టాయిలెట్ల కోసం క్యూ కట్టారు. కంపు భరించలేక అవస్థలు పడ్డారు. తాగునీటి కోసం ట్యాంక్ వద్ద ఎగబడ్డారు. అపరిశుభ్రమైన నీటితోనే గొంతులు తడుపుకున్నారు. యోగాసనాలు వేసేంత వరకు ఎండలోనే పడిగాపులు కాశారు. రాత్రి గ్రౌండ్, బస్సుల్లోనే పడుకున్నారు. కూటమి ప్రభుత్వం సరైన వసతి సౌకర్యాలు కల్పించకపోయినప్పటికీ.. సగం నిండిన కడుపులతో.. ఎండ వేడికి గొంతెండుతున్నా.. నిద్ర లేక నీరసించినా.. 25 వేల మంది విద్యార్థులు 108 నిమిషాల పాటు 108 సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డును సాధించారు.

విద్యార్థుల హాహాకారాలు

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అల్లూరి జిల్లా నుంచి 25 వేల మంది గిరిజన విద్యార్థులతో యోగాసనాలు చేయించి రికార్డు సాధించాలని కూటమి ప్రభుత్వం భావించింది. ఇందుకోసం గురువారం రాత్రికే కొంత మంది గిరిజనులను నగరానికి తీసుకువచ్చింది. కానీ రాత్రి వసతి ఏర్పాట్లు చేయలేదు. సక్రమంగా భోజనాలు అందించలేదు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా అర్ధాకలితోనే ఉన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ మైదానంలోనే ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతూ అవస్థలు పడ్డారు. మరుసటి రోజు శుక్రవారం తెల్లవారుజామున మరి కొంత మంది విద్యార్థులను అల్లూరి జిల్లా నుంచి ఇక్కడికి తీసుకువచ్చారు. వీరికి కూడా మధ్యాహ్నం సక్రమంగా భోజన ఏర్పాట్లు చేయలేదు. 25 వేల మంది పిల్లలను తీసుకొచ్చి ఎండలోనే ఐదు కౌంటర్లలో భోజనాలు వడ్డించారు. దీంతో విద్యార్థులు గంటల తరబడి క్యూలైన్లలో ఉండాల్సి వచ్చింది. రోడ్డు మీదే భోజనాలు చేశారు. అనంతరం చేతులు కడుక్కోడానికి మంచినీటికి కూడా లైన్లలో నిలబడాల్సి వచ్చింది. కనీసం వాటర్ బాటిళ్లు అందించకపోవడంపై ఉపాధ్యాయులు మండిపడ్డారు.



బురదలోనే భోజనాలు.. కంపుకొట్టిన టాయిలెట్లు

యోగాంధ్రలో శనివారం ఉదయం పరిస్థితి మరింత దారుణంగా మారింది. 5 వేల మందికి వేసిన ఒక్కో టెంట్‌కు కేవలం 10 తాత్కాలిక టాయిలెట్లు మాత్రమే ఏర్పాటు చేశారు. ఇలా మొత్తం 25 వేల మందికి టెంట్లు వేశారు. దీంతో ఉదయం చిన్నారులు కాలకృత్యాలు తీర్చుకోడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ టాయిలెట్లను శుభ్రం చేసే వారు లేక తీవ్ర దుర్గంధం వెదజల్లింది. అయినప్పటికీ మరో దారి లేక ముక్కు మూసుకుంటూనే వెళ్లాల్సి వచ్చింది. అలాగే దాని పక్కనే టిఫిన్లు ఏర్పాటు చేశారు. బాత్‌రూమ్‌ల నుంచి వచ్చిన నీటితో బురదమయంగా మారిన గ్రౌండ్‌లోనే చిన్నారు లు అల్పాహారం తిన్నారు. ఇక మంచినీటి కోసం చిన్నపాటి యుద్ధమే చేశారు. విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందించకుండా వాటర్ ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేశారు. తీసుకొచ్చిన వాటర్ కంటైనర్లు నిమిషాల్లోనే ఖాళీ అయ్యాయి. దీంతో చిన్నారులు వాటర్ ట్యాంకర్ వద్ద, డ్రమ్ముల్లో అడుగంటిన అపరిశుభ్రమైన నీటిని తాగుతూ సమస్యలు ఎదుర్కొన్నారు.

మైదానం.. బస్సుల్లోనే నిద్ర



అల్లూరి జిల్లా నుంచి 25 వేల మందిని గిరిజన విద్యార్థులను తీసుకువచ్చిన కూటమి ప్రభుత్వం వారికి సరైన వసతి సౌకర్యాలు కల్పించడంలో విఫలమైంది. వీరికి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, విశాఖ వ్యాలీ స్కూల్, పెందుర్తి ప్రాంతంలోని ఒక కల్యాణ మండలంలో శుక్రవారం రాత్రి వసతికి ఏర్పాట్లు చేశారు. అయితే 25 వేల మందికి అది సరిపోకపోవడంతో చాలా మంది విద్యార్థులను ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్ లోనే వదిలేశారు. దీంతో విద్యార్థులు గ్రౌండ్ లోను, బస్సుల్లోనే ఇబ్బందులు పడుతూ పడుకున్నారు. అలాగే వసతి ఏర్పాట్లు చేసిన వారికి కూడా రాత్రి 10 గంటలకు తీసుకువెళ్లి మళ్లీ ఉదయం 3 గంటలకే సిద్ధం ఉండాలని ఆదేశించారు. తెల్లవారుజామునే అక్కడి నుంచి ఏయూ గ్రౌండ్‌కు తీసుకువచ్చారు. శనివారం తెల్లవారకముందే మళ్లీ వారు యోగాసనాలకు సిద్ధమయ్యారు. దీంతో వీరికి సరైన భోజనం, నిద్ర లేక నీరసించిపోయారు. ఉదయం 8 గంటలకు యోగాసనాల తర్వాత కూడా టిఫిన్లు అందించే విషయంపై కూడా దృష్టి పెట్టలేదు. కొంత మంది వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థలకు ఆ బాధ్యతలు అప్పజెప్పడం, వేల సంఖ్యలో విద్యార్థులు ఉండడంతో తోపులాట జరిగే అవకాశం ఉంటుందని భయపడి అనేక మంది విద్యార్థులు టిఫిన్ల కోసం వెళ్లలేదు. యోగాసనాల సమయంలో అందించిన కిట్‌లో ఉన్న అరటి పండు, బిస్కెట్, చెక్కీ తిని అర్ధాకలితోనే అనేక మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు అల్లూరి జిల్లాకు బస్సులు ఎక్కారు.



ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గౌరీమణి తెలిపారు. వచ్చే 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు దగ్గరలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకోకపోతే కౌన్సెలింగ్‌కు అనుమతి లభించదన్నారు. ఏ ఐటీఐలో చేరాలనుకుంటున్నారో అక్కడే కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు.

కలెక్టరేట్‌లో యోగా

తుమ్మపాల: పరిసరాల పరిశుభ్రతతోపాటు ప్రతి రోజు గంట సమయం యోగాసనాలు వేస్తే పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా యోగాంధ్ర సమన్వయ అధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన యోగాభ్యాసానికి ప్రతి రోజు సమయం కేటాయించేలా అందరితో ప్రతిజ్ఞ చేయించారు. యోగా గురువులు బి.అప్పారావు, ఎస్.నగేష్‌ల సూచనల మేరకు పలు రకాల యోగాసనాలను అభ్యసించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పి.వి.రత్నం, ఎస్.ఎస్.వి.ఎస్ నాయుడు, రాజేశ్వరి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్ ప్రాంగణంలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

పాలిటెక్నిక్ ప్రవేశ కౌన్సెలింగ్ ప్రారంభం



నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధ్యాపకులు



నర్సీపట్నంలో మొదటి విద్యార్థికి రసీదు అందజేస్తున్న స్టేట్ సెక్రటరీ రామచంద్రరావు, ప్రిన్సిపాల్ తాతాజీ



రేబాక పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థికి రసీదు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

నర్సీపట్నం/తుమ్మపాల: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు శనివారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాల, అనకాపల్లి మండలంలోని రేబాక పాలిటెక్నిక్ కళాశాలల్లో మొదటి రోజు 1 నుంచి 15,000వ ర్యాంకు వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. నర్సీపట్నం కాలేజీ ప్రిన్సిపాల్ తాతాజీ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయించారు. 3,567 ర్యాంకు వచ్చిన విద్యార్థి పి.విజయ్‌కుమార్‌తో మొదటి వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఈ ప్రక్రియను పాలిటెక్నిక్ స్టేట్ సెక్రటరీ జి.వి.రామచంద్రరావు పరిశీలించారు. ధ్రువపత్రాలను పరిశీలించి రశీదు, సర్టిఫికెట్‌ను అందజేశారు. తొలి రోజు ఈ సెంటర్‌లో 60 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. రేబాక సెంటర్‌లో 164 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు పొందిన సిగ్గు శ్రీవెంకట్ (556), లక్కవరపు ధరణి (1,233)ల సర్టిఫికెట్లను తొలుత పరిశీలించారు. ఆదివారం 15,001 నుంచి 32,000 ర్యాంకు వరకు గల విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

జారిపడితే ఎవరిది బాధ్యత?



భయం భయంగా షెడ్డుపైకి ఎక్కుతున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గాంధీనగరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు బాల కార్మికులుగా అవతారమెత్తారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో పాఠశాలలో ఒక గది రేకుల షెడ్‌పై పడిన ఎండిన ఆకులను శుభ్రం చేసి, ఒక ప్లాస్టిక్ డబ్బాలోకి ఎత్తి కిందకు దించారు. ఈ సముదాయంలోనే ప్రైమరీ, హైస్కూల్ కలిపి ఉన్నాయి. ఈ ప్రాంతంలో భారీ చెట్ల ఆకులన్నీ స్కూల్ ప్రాంగణంలో షెడ్‌పై పడుతుంటాయి. ఆ షెడ్ పైకి వెళ్లడానికి మెట్ల సదుపాయం లేదు. అలాగని నిచ్చెన సాయంతో జాగ్రత్తతో వెళ్లారా అంటే అదీలేదు. ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు కాలు జారితే భారీ మూల్యమే చెల్లించుకోవాలి. అసలు కూలీలతో చేయించాల్సిన పనులు విద్యార్థులతో ఎందుకు చేయించారో...?



గాంధీనగరం ప్రభుత్వ పాఠశాలలో షెడ్డుపై ఎండిన ఆకులను శుభ్రం చేస్తున్న బాలలు

క్లుప్తంగా

కలెక్టరేట్ వద్ద యువత పోరు రేపు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజు



అనకాపల్లి: నిరుద్యోగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఏడాది నుంచి ఆటలాడుతోందని, సార్వత్రిక ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, లేని పక్షంలో నెలకు రూ.3వేల చొప్పున నిరుద్యోగ భృతి అందజేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి నాయకులు..ఆ హామీని విస్మరించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్ రాజ్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. భృతి చెల్లించకుండా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, నిరుద్యోగ భృతి పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈనెల 23న కలెక్టర్ కార్యాలయం వద్ద యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. నిరుద్యోగులకు వెంటనే నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కో కుటుంబానికి వివిధ రూపాల్లో సుమారు రూ.లక్ష నగదు అందేదని, ఏడాది కూటమి పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నిరాశే మిగిలిందని తెలిపారు. ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లను, రేషన్‌వాహనాలు, పశు సంచార వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు.

కనకమహాలక్ష్మికి తులసిపూజ

దాబాగార్డెన్స్(విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు.

హైస్కూల్ విద్య.. హైరానా

- ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయి తగ్గింపుతో విద్యార్థులకు అవస్థలు
- దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి
- మధ్యలో బడి మానేస్తున్న పేద విద్యార్థులు



స్థాయి తగ్గిన జి. భీమవరం స్కూలు

కోటవురట్ల: నూతన విద్యా విధానంలో భాగంగా మండలంలోని మూడు ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిని తగ్గించి, ప్రాథమిక పాఠశాలలకు పరిమితం చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు కిలో మీటర్ల దూరంలోఉన్న హైస్కూళ్లకు అధిక వ్యయప్రయాసలకోర్చి అష్ట కష్టాలు పడి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని ఉగ్గినపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం ప్రాథమికోన్నత పాఠశాలలను నూతన విద్యా విధానంలో ఈ ఏడాది ఎత్తి వేశారు. ఆ పాఠశాలల స్థాయిని తగ్గించి ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో చదివే 6,7,8 తరగతుల విద్యార్థులు దూరంగా తాళ్లపాలెంలో ఉన్న హైస్కూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

➡ జి.భీమవరం పాఠశాలలో ఈ ఏడాది 5 నుంచి 6వ తరగతికి వచ్చిన వారు 19 మంది, 6 నుంచి 7వ తరగతికి వచ్చిన వారు 11 మంది ఉన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల స్థాయి తగ్గించడంతో విద్యార్థులు సుమారు 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న తాళ్లపాలెం హైస్కూళ్లకు ఆటోల్లో చేరుకోవలసి వస్తోంది. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే ఈ విద్యార్థుల్లో కొందరు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపగా, మిగిలిన వారు ప్రభుత్వ హైస్కూల్‌లో చేరారు.

➡ అచ్చెర్ల ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిని కుదించడంతో 5 నుంచి 6వ తరగతికి వచ్చిన నలుగురు, 6 నుంచి 7వ తరగతికి వచ్చిన ఆరుగురు విద్యార్థులు ఐదు కిలో మీటర్ల పైగా ఉన్న తాళ్లపాలెం హైస్కూల్‌కు ఆటోల్లో రావలసి వస్తోంది.

➡ ఉగ్గినపాలెం ప్రాథమికోన్నత పాఠశాల స్థాయి తగ్గించి ప్రాథమిక పాఠశాలకు పరిమితం చేయడంతో అక్కడ చదివే 5 నుంచి 6వ తరగతి వచ్చిన ఎనిమిది మంది, 6 నుంచి 7వ తరగతికి వచ్చిన ఏడుగురు సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న తాళ్లపాలెం హైస్కూలుకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలల స్థాయి తగ్గించి, విద్యార్థులకు విద్యను దూరం చేయడం, ఇబ్బందులకు గురి చేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు విద్యార్థులు మధ్యలో బడి మానేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా పాఠశాలలను యథావిధిగా నిర్వహించాలని కోరుతున్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలోనే తరగతులు నిర్వహించాలి



గత ఏడాది అందుబాటులో ఉన్న జి. భీమవరం ప్రాథమికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుకున్నాను. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో అక్కడ ఆరేడు తరగతులు ఎత్తి వేశారు. దీంతో ఐదు కిలో మీటర్ల దూరంగా ఉన్న తాళ్లపాలెం హైస్కూల్‌కు ఆటోలో రావడం ఇబ్బందిగా ఉంది. ప్రాథమికోన్నత పాఠశాలను యథావిధిగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మడగల చరిష్మా, 7వ తరగతి, జి.భీమవరం.

ఐదు కిలోమీటర్ల దూరంలో హైస్కూల్



గ్రామంలో దగ్గరగా ఉండే ప్రాథమికోన్నత పాఠశాలలో గత ఏడాది వరకు చదువుకున్నాం. 6,7 తరగతులు ఎత్తివేయడంతో ఐదు కిలో మీటర్ల పైగా ఉన్న తాళ్లపాలెం హైస్కూల్‌లో 7వ తరగతిలో చేరాను. ఆటోలో వెళ్లాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నాను.

– నైనంశెట్టి పూర్ణ, 7వ తరగతి, అచ్చెర్ల.

స్కూల్‌కు వెళ్లడం ఇబ్బందిగా ఉంది



మా గ్రామంలో ఉండే ప్రాథమికోన్నత పాఠశాలలో 6,7 తరగతులు ఎత్తి వేయడంతో సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న తాళ్లపాలెం స్కూల్‌కు సైకిల్‌పై వెళుతున్నాను. అంత దూరం సైకిల్ తొక్కలేకపోతున్నాను.

– కరక మోహన్‌కుమార్, 7వ తరగతి, ఉగ్గినపాలెం.

ఆదర్శ రైతు మృతి



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ రామారావు



చంటి అప్పారావు (ఫైల్)

కోటవురట్ల: మండలంలో కైలాస పట్నం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు, గ్రామ పెద్ద సిద్ధాబత్తుల చంటి అప్పారావు శనివారం మృతి చెందారు. చిన అప్పారావు పెద్ద కోడలు ఉమాదేవి జెడ్పీటీసీ కాగా, పెద్ద కుమారుడు సత్తిబాబు, చిన్న కుమారుడు నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. చంటి అప్పారావు మరణంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ నడిచే సమయంలో అత్యధికంగా చెరకు సరఫరా చేసిన రైతుగా చంటి అప్పారావు పలు అవార్డులను అందుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు డి.వి. సూర్యనారాయణ రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా వ్యవసాయ సలహా మండలి మండలి మాజీ చైర్మన్ చిక్కాల రామారావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.ఎస్. సత్యనారాయణ రాజు తదితరులు చిన అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు.

ఇంటి సరిహద్దు విషయంలో ఇరువర్గాల మధ్య కొట్లాట

దేవరాపల్లి: మండలంలోని రైవాడలో ఇంటి సరిహద్దు విషయంలో ఇరువర్గాల మధ్య శనివారం జరిగిన గొడవ కొట్లాటకు దారి తీసింది. పోలీసులు, గాయపడిన వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామాలయానికి ఎదురుగా ఉన్న వీధిలో ఇంటి నిర్మాణ సరిహద్దు విషయంలో శీర రమణ, శీర అచ్చియ్యమ్మ కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు కొట్లాటకు దిగడంతో ఒక వర్గానికి చెందిన శీర రమణ, అతని భార్య లక్ష్మి, కుమారుడు దుర్గా ప్రసాద్‌కు గాయాలయ్యాయి. మరో వర్గానికి చెందిన శీర అచ్చియ్యమ్మకు సైతం గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వీరికి దేవరాపల్లి పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం చేసిన అనంతరం 108 వాహనంలో కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పైడిరాజు తెలిపారు.

విశాఖ అభివృద్ధి నా బాధ్యత



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేతన్ గార్గ్

- మెట్రో, ఫ్లైఓవర్ ప్రాజెక్టులు వేగవంతం చేస్తాం
- పాతనగరం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి
- జీవీఎంసీ నూతన కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్(విశాఖ): విశాఖ నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, నగరాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని జీవీఎంసీ నూతన కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'నగరంలో పారిశుద్ధ్యం, సుందరీకరణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తా. పౌరులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పిస్తా. తాగునీరు, వీధి దీపాలు, కాలువలు, రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి జీవీఎంసీకి అందే నిధులను సక్రమంగా వినియోగించి, విశాఖను మరింత అభివృద్ధి చేస్తా. ఇందుకోసం మేయర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకుంటా. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖకు ఉత్తమ ర్యాంకు సాధించేందుకు అందరి సహకారంతో కృషి చేస్తా. డీపీఆర్ ప్రకారం ప్రతిపాదించిన మెట్రో, ఫ్లైఓవర్ ప్రాజెక్టులకు జీవీఎంసీ తరఫున పూర్తి సహకారం అందిస్తా. ఆ పనులు వేగవంతమయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటా'అని చెప్పారు. నగరంలోని ఖాళీ స్థలాలను సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తానని నూతన కమిషనర్ తెలిపారు. పార్కులు, కూడళ్లను అభివృద్ధి చేస్తానని చెప్పారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన కాలువల్లోని పూడికను తొలగిస్తామన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులపై సర్వే నిర్వహించి, ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. దక్షిణ నియోజకవర్గం పాతనగరంలో సమస్యలున్నాయని, వాటిని ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రోడ్ల అభివృద్ధిపై సర్వే నిర్వహించి, అడ్డంకులుంటే న్యాయపరంగా వాటిని పరిష్కరిస్తామని, బిల్డింగ్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. నగరంలోని సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను పోలీస్ శాఖ, జీవీఎంసీ సమన్వయంతో నిర్వహిస్తామన్నారు. తీర నగరమైన విశాఖను ఇతర నగరాలతో 'సిస్టర్ సిటీ'లుగా అనుసంధానించేందుకు ప్రయత్నిస్తామని, నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని కేతన్ గార్గ్ పేర్కొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతో సుస్థిర అభివృద్ధి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా



యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు

విశాఖ లీగల్ : ఆరోగ్యవంతమైన సమాజంతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ, విశాఖ న్యాయవాదుల సంఘం సంయుక్తంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించాయి.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక శ్రమ, యోగ ధ్యానం తప్పనిసరి అని తెలిపారు. విశాఖలో తొలిసారిగా అత్యంత ప్రతిష్టాత్మకంగా యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినందుకు పలువురిని అభినందించి, భారత ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పూరీ రథయాత్ర కోసం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): పూరీలో జగన్నాథ రథయాత్రకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం నుంచి పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–పూరీ(08313) స్పెషల్ రైళ్లు ఈ నెల 27, జూలై 5న రాత్రి 12.45 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు పూరీ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో పూరీ–విశాఖపట్నం(08314) స్పెషల్ రైళ్లు ఈ నెల 28, జూలై 6 తెల్లవారు 2.15 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 1 గంటకు విశాఖపట్నం చేరుకుంటాయి.

లక్కబొమ్మలతో యోగాసనాల ఆకృతులు



ఏటికొప్పాక హస్త కళాకారులు తయారు చేసిన బొమ్మలు

యలమంచిలి రూరల్: ఏటికొప్పాక హస్తకళాకారులు యోగాసనాల ఆకృతులతో బొమ్మలు రూపొందించి మరోసారి తమ సృజనాత్మకత చాటుకున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గోర్స సంతోష్‌కుమార్, వానపల్లి సాయి ఈ బొమ్మలను రూపొందించారు.

హైవేలో ట్రాఫిక్ జామ్

- స్తంభించిన ప్రజా రవాణా
- ప్రయాణికులకు నరకయాతన



వెంకోజీపాలెం వద్ద స్తంభించిన ట్రాఫిక్



మధురవాడ క్రికెట్ స్టేడియం సమీపంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జామ్

ఎంవీపీకాలనీ(విశాఖ): విశాఖపట్నం వేదికగా జరిగిన 'యోగాంధ్ర' కార్యక్రమం నగరవాసులకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రయాణికులకు తీవ్ర అవస్థలు మిగిల్చింది. కార్యక్రమం కోసం ప్రభుత్వం సుమారు 9,995 ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. శనివారం తెల్లవారుజాము నుంచే మద్దిలపాలెం, ఇసుకతోట, హనుమంతవాక, మధురవాడ, ఆనందపురం కూడళ్లలో జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. గ్రామీణ నియోజకవర్గాల నుంచి వచ్చిన వాహనాలను తగరపువలస, ఆనందపురం, మధురువాడ, ఎండాడ, జూపార్క్ కూడళ్ల మీదగా బీచ్‌లోకి పంపించడంతో ఆయా కూడళ్లలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. దీంతో యోగా కార్యక్రమానికి వెళ్లేవారితో పాటు, సాధారణ ప్రజలు గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యోగాంధ్రకు వెళ్లే వారంతా ఆయా ప్రాంతాల్లోని జాతీయ రహదారులపై దిగి బీచ్‌రోడ్డుకు నడుచుకుంటూ వెళ్లాల్సివచ్చింది. ఇక విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సులు లేక, ప్రైవేటు వాహనాలు దొరక్క ద్వారకా, మద్దిలపాలెం బస్‌స్టేషన్ల వద్ద గంటల తరబడి పడిగాపులు కాశారు. ఇదే అదనుగా కొన్ని ఆటోలు, ప్రైవేటు వాహనాలు ప్రయాణికుల నుంచి అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేసి వారిని మరింత ఇబ్బందికి గురిచేశాయి. మొత్తం మీద యోగాంధ్ర కార్యక్రమం నగరంలో ట్రాఫిక్ గందరగోళాన్ని, ప్రయాణికులకు నరకయాతనను మిగిల్చింది.



మద్దిలపాలెం కూడలిలో స్తంభించిపోయిన ట్రాఫిక్

తిట్టిన తిట్లకు తలెత్తుకోలేకపోతున్నాను

- పగ వాళ్లకు కూడా ఈ ఆర్‌పీ ఉద్యోగం రాకూడదు
- వాట్సాప్ గ్రూప్‌లో ఒక ఆర్పీ ఆవేదన

విశాఖ సిటీ: యోగాంధ్ర కార్యక్రమంలో తీసుకువెళ్లిన డ్వాక్రా మహిళలకు నీళ్లు కూడా ఇవ్వకపోవడంతో వారు తిట్టిన తిట్లకు కుమిలిపోతూ, కన్నీరు పెట్టుకుంటూ ఒక ఆర్‌పీ మాట్లాడిన మాటల ఆడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. సదరు ఆర్‌పీ తన ఆవేదనను వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న ఉన్నతాధికారులకు తెలియజేస్తూ పంపించిన ఆడియో మెసేజ్ లీక్ అయింది. అందులో ఆమె ప్రస్తావించిన విషయాలివి.. 'గ్రూప్‌లో ఉన్న ఏపీడీ, సీవోలకు, ఆర్పీలకు నమస్కారం. 'ఇలాంటి మీటింగ్ నాజీవితంలో చూడలేదు. జనాలు దారుణంగా తిడుతున్నారు. ఆర్‌పీల మీద ఉన్న మంచి పేరు పోయింది' అని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తాము జనాలను పోగేస్తే, సచివాలయ సిబ్బంది వారితో ఫొటోలు దిగి తమ ఉద్యోగాలను మెరుగుపరుచుకున్నారని విమర్శించారు. 'మా పరువు రోడ్డున పడింది. ఇలాంటి ఉద్యోగాలు పగవాళ్లకు కూడారాకూడదు' అని తీవ్రనిరాశతో మాట్లాడారు. ఇలాంటి పరిస్థితి పగోళ్లకు కూడా రాకూడదు అంటూ ఆమెమాటలుఇప్పుడుచర్చనీయాంశంగా మారాయి.

రైలులో సాంకేతిక లోపం

తాటిచెట్లపాలెం: సిల్చార్–త్రివేండ్రం (12508) ఎక్స్‌ప్రెస్‌లో శనివారం రాత్రి విశాఖలో సాంకేతిక లోపం తలెత్తింది. రైలు రాత్రి 7 గంటల తర్వాత విశాఖ చేరుకుని, బయలుదేరిన కొద్దిసేపటికే సెకండ్ ఏసీ కోచ్‌లో సమస్య కారణంగా ప్రయాణికులు చైన్ లాగి ఆపేశారు. రైల్వే అధికారులు రైలును వెనక్కి తీసుకువచ్చి మరమ్మతులు చేపట్టారు. సుమారు 4 గంటల ఆలస్యంగా బయలుదేరింది.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నిత్య కల్యాణం ఉదయం 9:30 గంటల నుంచి వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు వంటి ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ అత్యంత విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవను ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై కొలువుదీర్చారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించి, విశేషంగా హారతి సమర్పించారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

క్లుప్తంగా

యోగా గురువులకు సత్కారం



యోగా గురువులను సత్కరిస్తున్న ప్రవీణ్‌కుమార్

అనకాపల్లి టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలో యోగా గురువులకు సత్కార కార్యక్రమం జరిగింది. స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ యోగా గురువులు బి. దొరమ్మనాయుడు, మాదేటి జగన్, నగేష్, నరసింగరావు, తదితరులకు సత్కారం చేసి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతా లక్ష్మణ్‌రావు, ముగడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'యోగాంధ్రతో నిధులు దుర్వినియోగం'

అనకాపల్లి: యోగాంధ్ర పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాంధ్ర కాదు ఉద్యోగాంధ్ర, విద్యాంధ్రప్రదేశ్, ఆకలి రహిత ఆంధ్రప్రదేశ్‌గా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందజేసినట్లయితే ఒలింపిక్స్‌లో ఇండియాకు గోల్డ్ మెడల్స్ తీసుకువస్తారన్నారు. కూటమి ప్రభుత్వం యోగాంధ్ర పేరుతో గిరిజన విద్యార్థులకు నరకం చూపించడం సరైన పద్ధతి కాదన్నారు. విద్యా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, సంక్షేమ వసతి గృహాలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయని వాపోయారు. శాశ్వత సొంత భవనాలు లేక విద్యార్థులు చాలీచాలని గదులతో ఇబ్బందులు పడుతూ చదువును కొనసాగిస్తున్నారన్నారు. గిరిజన వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు లేక సమయానికి సరైన వైద్యం అందక విష జ్వరాలతో, విషసర్పాల బారిన పడి మృత్యువాత పడుతున్నట్లు వాపోయారు. గిరిజన సంక్షేమ కళాశాల వసతి గృహాల్లో వర్కర్స్‌కు జీతాలు విద్యార్థుల మెస్ బిల్లుల నుంచి ఇచ్చే పద్ధతిని తొలగించి, ప్రభుత్వమే చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడ వసతి సౌకర్యాలు లేక విద్యార్థులు ఆటలకు దూరం అవుతున్నారని, మరోపక్క డిగ్రీలు పూర్తి చేసుకుని పట్టాలు పట్టుకుంటూ ఉద్యోగాలు లేక రోడ్ల మీద పడ్డారని, ప్రభుత్వం తక్షణమే ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు.

అష్టాదశ శక్తి పీఠంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని న్యూకాలనీలో అష్టాదశ శక్తి పీఠం ఆలయ 10వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే భక్తులు ప్రత్యేక కుంకుమార్చన చేశారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ పూజారి, బెజవాడ మంగారావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 73 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,720	4,800
రెండో రకం	3,650	3,750
మూడో రకం	3,150	3,410

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
డ్రాగన్	:సత్యనారాయణస్క్రీన్-1
8 వసంతాలు	: సత్యనారాయణ స్క్రీన్-2
ఖలేజా	:పర్తిసాయి
సితార జమీన్ పర్	:షిర్డీసాయి
పాప	:వెంకటేశ్వర
కట్టప్ప జడ్జిమెంట్	:శ్రీసత్య
హంటర్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-15, ఓ పాజిటివ్-14, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 312 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

అప్పల వంట.. బకాయిల మంట

- పెరిగిన ధరలకు అనుగుణంగా మారని మెనూ చార్జీలు
- 3 నెలలుగా జీతాలు చెల్లించని కూటమి ప్రభుత్వం
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఆర్థిక ఇబ్బందులు
- పాఠశాలల్లో భోజనం నాణ్యతపై ప్రభావం

సర్కారు బడులను నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే విద్యార్థుల సంఖ్యను బూచిగా చూపించి కొన్ని పాఠశాలలను మూసివేసింది. మరికొన్నింటిని మూసేయడానికి సిద్ధమవుతోంది. ఇదే సమయంలో మిగిలిన స్కూళ్లలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందకుండా కుట్ర చేస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం మెనూ చార్జీలు పెంచకపోగా, కొంతమంది నిర్వాహకులను తొలగించి మిగిలిన వారికి మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు.



జీవీఎంసీ పెద్ద హైస్కూల్లో వంట చేస్తున్న నిర్వాహకురాలు(ఫైల్)

అనకాపల్లి: కూటమి పాలనలో మధ్యాహ్న పథకం నిర్వాహకులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్లతరబడి చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్న వీరిని తొలగిస్తోంది. ఎన్నికల హామీ మేరకు పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా మధ్యాహ్న భోజనం పథకానికి బడ్జెట్ పెంచకపోగా, నెలవారీ బిల్లులు సైతం సక్రమంగా ఇవ్వడం లేదు. పథకం పేరు మార్పు చేయడం తప్ప మెనూ చార్జీలు పెంచలేదు. దీంతో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత తగ్గుతుందనే విమర్శలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకులు, కూరగాయలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ధరలను నియంత్రించడంతో ప్రభుత్వం విఫలమైంది. ధరలు పెరుగుదల భారం మధ్యాహ్న భోజనంపైనా పడింది. పట్టణ, మండలంలో 8467 మంది విద్యార్థులు చదువుతున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో....

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం పథకం మెనూ చార్జీలు మార్పులు చేస్తుండేది. పథకం నిర్వాహకులకు ఇబ్బందులు ఉండేది కాదు. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు వరకూ అప్పటి టీడీపీ ప్రభుత్వం మధ్యాహ్న పథకం నిర్వాహకులకు నెలకు రూ. వెయ్యి మాత్రమే ఇచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల హామీ మేరకు రూ.2 వేలు పెంచడంతో నెలకు రూ.3 వేలు గౌరవ వేతనం అందించేవారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని ఏడాదిగా అమలు చేయలేదని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడు మాసాలుగా నిధులు నిల్....

- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి నెలా 15 నుంచి 20వ తేదీలోపు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు బిల్లులు చెల్లించేవారు.
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఏడాది మార్చి నుంచి నేటి వరకూ ఒక్క రూపాయి చెల్లించలేదు.
- సకాలంలో బిల్లులు ఇవ్వకపోయినా.. విద్యార్థుల భవితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు సొంత పెట్టుబడులు పెట్టి మెనూ అమలు చేస్తున్నారు.
- ప్రభుత్వం జీవో పేరుతో 25 మంది విద్యార్థులకు ఒకరు మాత్రమే ఉండాలని, 26 నుంచి 100 మంది వరకూ ఇద్దరు నిర్వాహకులు ఉండాలని కొత్త నిబంధనలు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 50 మంది విద్యార్థులకు ఇద్దరు నిర్వాహకులు ఉండాలి.
- హైస్కూల్లో 9, 10 తరగతులు విద్యార్థులకు భోజనాలు పెడుతున్నప్పటికీ, 2008 నుంచి పథకం నిర్వాహకులకు జీతాలు లేకుండా ఉన్నాయి.
- హైస్కూల్ స్థాయిలో 600 నుంచి 650 మంది విద్యార్థులకు ముగ్గురు నుంచి ఐదుగురు నిర్వాహకులు పనిచేస్తుంటే ముగ్గురికి మాత్రమే జీతాలు ఇస్తున్నారు.
- ప్రభుత్వం రకరకాల మెనూతో విద్యార్థులకు వంట చేసి పెట్టాలని నిబంధనలు విధిస్తుంది.
- నెలకు చాలీచాలనీ రూ.3 వేల జీతంలో కార్మికులు పనిచేస్తున్నారు.
- ఎలిమెంటరీ (1 నుంచి 5వ తరగతి) స్కూల్‌లో ఒక్కొక్క విద్యార్థికి రూ.5.53, హైస్కూల్ స్థాయి (6 నుంచి 10వ తరగతి)లో ఒక్కొక్క విద్యార్థికి రూ.8.45 మాత్రమే చెల్లిస్తున్నారు. పెంచుతామని చెప్పిన నగదు నేటికీ ఇవ్వలేదు.

రోజు రోజుకు నిత్యావసర ధరల పెరుగుదల

గతంలో లీటర్ పామాయిల్ రూ.100 ఉంటే, ప్రస్తుతం రూ.150కు పెరిగింది. ఉల్లి గతంలో కిలో రూ.15 ఉంటే, ప్రస్తుతం రూ.30, కందిపప్పు కేజీ రూ.110 నుంచి ప్రస్తుతం రూ.160 అమ్మకాలు సాగుతున్నాయి. ధరలు పెరిగినప్పటికీ మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకుల మెనూ చార్జీలు మాత్రం పెంచలేదు.



జీవీఎంసీ పెద్ద హైస్కూల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

పెరిగిన ధరలతో వంటలు కష్టం



నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చే నిధులతో మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాలంటే కష్టంగా ఉంది. మూడు మాసాలుగా నగదు చెల్లించలేదు. నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచి, బిల్లులు చెల్లించాలి.

– సూరిలక్ష్మి, మండల పథకం నిర్వాహకురాలు, అనకాపల్లి

ప్రభుత్వాలు వాగ్దానాన్ని అమలు చేయాలి



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఎలిమెంటరీ స్కూళ్లను తొలగించడం వల్ల 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎండీఎం కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. బల్లపూడి పంచాయతీ నాయుడుపేటలో కూటమి నేతలు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలను తొలగించడం అన్యాయం. తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి. గత టీడీపీ పాలనలో నిర్వాహకులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఇచ్చేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2 వేలు పెంచి నెలకు రూ.3 వేలు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం తక్షణమే కార్మికుల బకాయిలను చెల్లించాలి.

– వి.వరలక్ష్మి, పథకం రాష్ట్ర అధ్యక్షురాలు (సీఐటీయూ)

విరివిగా రోటరీ క్లబ్ సేవలు



విశ్వనాథ్‌ను శాలువాతో సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు రోటరీ క్లబ్ సీనియర్ అధ్యక్షుడు బీఎస్ గుప్తా తెలిపారు. స్థానిక న్యూకాలనీ రోటరీ ఫంక్షన్ హాల్లో శుక్రవారం రాత్రి క్లబ్ చార్టర్ నైట్ డే వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. ఒక్కొక్క కుట్టు మిషన్‌కు రూ.25 వేలు ఖర్చు అయిందన్నారు. గవరపాలెం హిందు శ్మశాన వాటికకు రూ.కోటి విలువ చేసే క్రిమేషన్ మిషన్ అందజేశామని, గాంధీనగరం బీసీ వసతి మహిళా కళాశాల విద్యార్థినులకు రూ.1.50 లక్షల విలువ చేసే పరుపులు వితరణగా అందించామన్నారు. అనంతరం విశాఖ నుంచి వచ్చిన క్లబ్ పూర్వ అధ్యక్షుడు పి.డి.జి. విశ్వనాథ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి క్లబ్ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్, కార్యదర్శి దేవత అనిల్, సీనియర్ సభ్యులు కడిమిశెట్టి సతీష్, కె.ఎల్.కుమార్, బుద్ధ రమణాజీ, బుద్ధ సత్యనారాయణ పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని జ్యేష్ఠ మాసం చివరి శనివారం పురస్కరించుకొని వజ్ర కవచాలంకృతులతో పాటు పలు రకాల పూలమాలలు, తులసీమాలలతో అందంగా అలంకరించారు. స్వామివారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించుకున్నారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

హైవేలో యోగాంధ్ర బస్సుల రాకపోకలతో రద్దీ



కశింకోట వద్ద యోగాంధ్రకు వెళ్ల వరుసగా వస్తున్న, దూరపు ప్రాంత ఆర్టీసీ బస్సులు

కశింకోట: మండలంలోని జాతీయ రహదారి యోగాంధ్రకు వచ్చిన బస్సుల రాకపోకలతో శనివారం రద్దీగా మారింది. దీంతో రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని తరలించడానికి ఇతర జిల్లాల నుంచి వందలాదిగా ఆర్టీసీ బస్సులను రప్పించారు. బాపట్ల, గుంటూరు, నూజివీడు, నిడదవోలు, ఇబ్రహీంపట్నం, భీమవరం, రాజోలు, కాకినాడ, జంగారెడ్డి గూడెం, తాడేపల్లి, గుడివాడ, తుని తదితర సుదూర ప్రాంత డిపోల నుంచి ఆర్టీసీతోపాటు అద్దె బస్సులను రప్పించి, అనకాపల్లి, నర్సీపట్నం డిపోల బస్సులను వినియోగించి వారిని తరలించారు. మళ్లీ వారి గమ్యాలకు చేర్చి తమ ప్రాంతాలకు ఖాళీగా జాతీయ రహదారి మీదుగా బస్సులు గుంపులుగా వరుసగా తరలి వెళ్లాయి. దీంతో జాతీయ రహదారి వాటి రాకపోకలతో రద్దీగా మారి రాకపోకలు నెమ్మదించడంతో వాహన చోదకులు తమ గమ్యాలకు చేరడానికి జాప్యం జరగడంతో ఇబ్బంది పడ్డారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

అనకాపల్లి: ఆరోగ్య వంతులైన యువతీ యువకులు ఏడాదికి మూడు సార్లు రక్తదానం చేయడం వల్లఆపదో ఉన్న మరో ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చని భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనకాపల్లి యూనియన్ రీజనల్ కార్యదర్శి పైలా ప్రసాద్ తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో బ్యాంక్ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి ఆదేశాలు మేరకు బ్రాంచ్ 70 వసంతాలను పురస్కరించుకుని అమరావతి సర్కిల్, రాజమహేంద్రవరం మాడ్యూల్, అనకాపల్లి బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన 18 నుంచి 60 ఏళ్లలోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేసిన వ్యక్తికి రెండు, మూడు రోజుల్లో కొత్త రక్తం శరీరంలో ఉత్పత్తి అవుతుందన్నారు. సృష్టిలో రక్తం దొరకదని, ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి రక్తదానం ఎంతో అవసరమన్నారు. గతంలో పురుషులు మాత్రమే రక్తదానం చేసేవారన్నారు. ఇటీవల కాలంలో మహిళలు రక్తదానం చేయడం ఎక్కువగా కనిపిస్తుందన్నారు. వ్యాధులు బారిన పడకుండా ఉండాలంటే రక్తదానం చేయడం మంచి పరిణామన్నారు. సుమారుగా 60 మంది బ్యాంక్ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ రక్తాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి రక్తనిధి సిబ్బంది సేకరించారు. కార్యక్రమంలో అనకాపల్లి రీజియన్ బ్యాంక్ సీఎం ఆపరేషన్ సంజయ్, హెచ్ఆర్ మేనేజర్ మధుబాబు, మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఈశ్వరి, ఎస్‌బీఐ యూనియన్ నాయకులు నరేష్, మహేష్, అసోసియేషన్ నాయకుడు రామకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి నూతన సొబగులు



వేంకటేశ్వరస్వామి ఆలయంపై ఏర్పాటు చేస్తున్న విష్ణుమూర్తి దశావతార విగ్రహాలు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి నూతన సొబగులు అద్దుతున్నారు. దాతలు సమకూర్చిన రూ.6 లక్షల విరాళంతో ఆలయంపై విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. 2012లో ఏర్పాటు చేసిన ఆలయాన్ని దఫదఫాలుగా దాతలు, భక్తుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నారు. ఇటీవల అందంగా ఆలయానికి, గోపురాలకు రంగులు వేయించారు. ఆలయ పేరుతో బోర్డును ఏర్పాటు చేశారు. తాజాగా దశావతార విగ్రహాలను శిల్పులు తయారు చేసి అమర్చి తీర్చిదిద్దుతున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మజ్జి ఫణీష్, కోన నాగ వెంకట సురేష్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం



ఘంటసాల చిత్రపటనికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి: ప్రపంచంలో దేశ సంగీత కళాకారులు ఎంతో ఖ్యాతిని గడించి, మహనుభావులుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్నరాజుపేటలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరజీవి ఘంటసాల చిత్రపటానికి శనివారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్యాగయ్య, అన్నమయ్య, పురందరదాసు, క్షేత్రయ్య, రామదాసు భక్తి కీర్తనలతో భగవంతునికి అంకితమయ్యారని పేర్కొన్నారు. తెలుగు వారైన బాలమురళీ కృష్ణ, ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, సుశీల, జానకి, లీల, పి.బి.శ్రీనివాస్ వంటి వారు తెలుగు సినీ రంగంలో తమ గానం ద్వారా తెలుగు జాతి, తెలుగు భాష కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు నందేల అప్పారావు, ఐ.వి. రమణ మూర్తి, ఎల్.వి.ఎ.రామారావు పాల్గొన్నారు.

వాడవాడలా యోగా దినోత్సవం




యోగాసనాలు వేస్తున్న తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్




మామిడిపాలెం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్: పట్టణం, మండలంలోని పలు చోట్ల యోగా వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్, డీఆర్‌డీఏ, మండలాలలోని వివిధ సచివాలయాల పరిధిలోని సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ యోగాతో పని ఒత్తిడి తగ్గి విధి నిర్వహణలో ప్రశాంతంగా ఉంటారన్నారు. ఎంపీడీవో ఆశాజ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీరామమూర్తి, ఏవో శ్రీనివాసరావు, ఆర్ఐ రమేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ సిహెచ్ ముకుందరావు మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. యోగా ఫర్ వర్ ఎర్త్ వన్ హెల్త్ అనే నినాదంతో ప్రాచుర్యం పొందిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వరావు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆదినారాయణ మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్, డైరెక్టర్ అనూష సుబ్రహ్మణ్యం పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించి, యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మామిడిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు.

కశింకోట: సాయినగర్‌లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. యల్లపు రుక్మిణి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కశింకోట, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం తదితర గ్రామాల్లో యోగా దినోత్సవం పురస్కరించుకొని తమ ఇళ్ల వద్ద, పాఠశాలల్లో యోగాసనాలు వేసి తమ ఉత్సాహాన్ని ప్రదర్శించారు.



సాయినగర్‌లో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు, పెద్దలు



ఆర్ఏఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది, పాలిటెక్నిక్ విద్యార్థులు

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఏనుగుతునిలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట: మండలంలోని ఏనుగుతుని గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ ద్వి దశమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు అప్పలాచార్యులు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, హోమం నిర్వహించారు. గొంతిన చిరంజీవి, గొంతిన నూకరాజు దంపతులు కార్యక్రమాన్ని జరిపించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. నరసాపురం నీటి సంఘం చైర్మన్ ఉప్పలూరు అప్పలనాయుడు, స్థానిక నాయకులు జెర్రిపోతుల నూకినాయుడు, తెరపల్లి శ్రీను, బొల్లి వెంకటరమణ, గొంతిన విజయ్, పీలా సామీలు తదితరులు పాల్గొన్నారు.

సూర్య తాపంతో విలవిల



అధిక ఉష్ణోగ్రతతో మెయిన్‌రోడ్డులో పలచగా జనసంచారం

అనకాపల్లి: మే, జూన్ మాసాల్లో వర్షాలు కురవడంతో ప్రజలు అధిక ఉష్ణోగ్రతలు నుంచి బయటపడ్డారు. అయితే శనివారం భానుడు తన ఉగ్రరూపం చూపించాడు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ వేసవిని తలపించేలా ఎండ కాయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వాహనదారులు శీతల పానీయాలతో తమ ఉష్ణ తాపాన్ని తీర్చుకున్నారు. ఈ నెల 9న 38.6 డిగ్రీలు కాగా, 21న 38.2 డిగ్రీలు నమోదైనట్లు ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు.

కశింకోట: మండల ప్రజలు శనివారం సూర్య తాపంతోపాటు వడగాలులు వీయడంతో సతమతమయ్యారు. ఉదయం నుంచి వేసవిని తలపిస్తూ అధిక ఉష్ణోగ్రతతో ఎండ కాయడంతో సాయంత్రం వరకు వడగాలులు వీచాయి. దీంతో అత్యవసర పనులు ఉన్నవారు తప్ప మిగిలిన ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇక్కడి ప్రధాన రహదారి, వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రం కాస్త వాతావరణం చల్లబడటంతో తమ కార్యకలాపాలు సాగించుకున్నారు.